ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం | 17 అక్టోబరు , 2026 | పేజీలు : 5



వివరాలు మెయిన్‌లో

## బిఎల్‌ఓలకు గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలి



కనగల్ మండలం శేరిలింగోటం గ్రామ పరిధిలో నీటి కొరతతో ఎండిపోయిన వరి, పత్తి పంటలను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాష్ట్ర కార్మిక,ఉపాధి,శిక్షణ శాఖల కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎల్‌నినో ప్రత్యేక అధికారి దాసరి హరిచందన, ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్లు.

వివరాలు మెయిన్‌లో

# సమయపాలన పాటించని వైద్య సిబ్బంది

### ఉదయం 10 గంటలు దాటినా ఆసుపత్రికి రాని వైనం.. వైద్య సేవల కోసం ప్రజల ఎదురుచూపులు

### బిపి మాత్రల కోసం వచ్చి వెనుదిరిగిన రోగులు.. ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై ప్రజల ఆగ్రహం



**ప్రజాపక్షం/త్రిపురారం:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందకపోవడం, నిత్యం వినియోగించే మందుల కోసం వచ్చిన వారు సైతం నిరాశతో వెనుదిరగాల్సి రావడం ఆం దోళన కలిగిస్తోంది. మండలంలోని పెద్దదేవులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న పరిస్థితి వైద్య సిబ్బంది పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయాల్లో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాల్సి ఉండ గా,ఉదయం 10 గంటలు దాటినా ఆసుపత్రికి వైద్య సిబ్బం ది రాకపోవడంతో రోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏ ర్పడింది. వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన పలువురు రోగులు వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగినట్లు తెలిసింది.

**పర్యవేక్షణ ఏదీ.. బాధ్యత ఎవరిది?**

వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరవుతున్నారా రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా బీపీ, మధుమేహం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి మందులు సకాలంలో అందడం ఎంతో ముఖ్యం.ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ,సిబ్బంది సమయానికి అందుబాటులో లేకపోతే ఆ సేవల ప్రయోజనం ప్రజలకు ఎలా అందుతుందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు అందాల్సిన వైద్యం సమయానికి అందాలి.. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.

**బీపీ మాత్రల కోసం వచ్చినా అందని వైద్యం కొప్పు మట్టయ్య**

ప్రతిరోజూ బీపీ మాత్రలు వేసుకోవాల్సిన రోగులు సైతం ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. బీపీ మాత్రల కోసం పెద్ద దేవులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన కొప్పు మట్టయ్య తన ఆవేదనను వ్యక్తం చేశారు. తను ప్రతిరోజూ బీపీ మాత్రలు వేసుకోవాలి. నా దగ్గర ఉన్న మాత్రలు అయిపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాను. ఉదయం 10 గంటలు దాటినా ఆసుపత్రిలో ఎవరూ అందుబాటులో లేరు. బీపీ మాత్రలు వేసుకోకపోతే ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదురవుతాయి.మాలాంటి రోగులకు సకాలంలో మందులు అందేలా చూడాలి. వైద్య సిబ్బంది నిర్ణీత సమయానికి ఆసుపత్రికి రావాలి” అని ఆయన కోరారు.



# ‘ఆక్సీ నౌ’ గ్యాస్ కంపెనీలో పేలుడు





### ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు, చికిత్స కోసం తరలింపు

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

వివరాలు మెయిన్‌లో

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వాకర్స్ మృతి

### సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామ స్టేజీ వద్ద ఘటన

### ఒకరికి తీవ్ర గాయాలు

### పోలీస్ స్టేషన్ ఎదుట మృతుల, బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన





వివరాలు మెయిన్‌లో



## అన్నదాన కార్యక్రమం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలోని 8వ వార్డు కోట్ల గడ్డలో దుర్గమాత యూత్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక వార్డు కౌన్సిలర్ తాళ్ల లావణ్య సురేష్‌రెడ్డి పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవి నవరాత్రి ఉత్సవాలు, భక్తి అధ్యాత్మికతతో పాటు ఐక్యమత్యానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. దుర్గమాత యూత్ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరికొప్పుల నాగేశ్వరరావు, కొణతం నాగిరెడ్డి, దుర్గమాత యూత్ సభ్యులు సుధీర్‌రెడ్డి, చందు, చిలక సైదులు, సట్టు సైదులు, నాగయ్య, గణేష్, వినయ్, నరేందర్, పాషా, రవి, శివ, సాయి పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని హుజూర్‌నగర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి అమ్మవారి పందపం వద్ద ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని బిజేపి నాయకులతో కలిసి ప్రారంభించారు. టీచర్స్ కాలనీ మహిళ ఉత్సవ కమిటీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు బెల్లంకొండ నరేష్, దొంతగాని అంజమ్మ, బెల్లంకొండ సౌజన్యం, రావినూతల ఇందిరమ్మ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## కెమిస్ట్రి వెంకటేశ్వరరావు మృతి బాధాకరం



**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణానికి చెందిన కెమిస్ట్రి బోధకులుగా ప్రసిద్ధి చెందిన కెమిస్ట్రి వెంకటేశ్వరరావు మృతి చెందడం చాల బాధాకరమని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరిశంకర్ అన్నారు. ఆయన ఇంటిపేరు మాదాల అన్న విషయం ఆనాటి సమాజానికి అంతగా తెలియదని, కెమిస్ట్రి వెంకటేశ్వరరావు గానే పిలవబడ్డారని గుర్తు చేశారు. హైద్రాబాద్‌లోని మాదాపూర్ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయన పార్థివ దేహనికి శుక్రవారం నివాళులర్పించారు. కెమిస్ట్రి బోధకునిగా ఆయన వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారని తెలిపారు. సంతా పం తెలిపిన వారిలో కెఆర్ఆర్ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ కామర్స్ లెక్చరర్ సిపికె చౌదరి, సీనియర్ జర్నలిస్టు గంధం బంగారు, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



**ప్రజాపక్షం/మునుగోడు :** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన కమిటీలు పనిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి సూచించారు. మండల కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు,కమిటీ సభ్యులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు ఆధ్వర్యంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.మండల స్థాయిలో ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, కోశాధికారితో పాటు ఇతర బాధ్యతలను నాయకులకు అప్పగించినట్లు తెలిపారు.గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం,కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడం లక్ష్యంగా కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నా రు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు తాటికొండ సైదులు, మందుల బీరప్ప,కార్యదర్శులు సంకు శంకర్, పందుల సంపత్, జక్కల శీను,నన్నూరి శేఖర్ రెడ్డి, ఆరెళ్ల సైదులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పంతంగి స్వామి,ఆనగంటి కృష్ణ,మహేష్ పాల్గొన్నారు.

## రైతు సంక్షేమంతోనే దేశాభివృద్ధి- రంగారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశంలో వ్యవసాయం వర్థిల్లి రైతు సమస్యలు శాశ్వతంగా పరిష్కారమై అగ్ర స్థానంలో నిలిచినప్పుడే నిజమైన దేశాభివృద్ధి సాధ్యమవుతుందని రైతు సంఘం జాతీయ నాయకులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య పార్కులో ఉదయం ప్రాతఃకాల వ్యాయామానికి వచ్చిన ప్రజలకు, వ్యాయామ ప్రియులకు 36వ అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభల కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధర దక్కాలని, అప్పుల ఊబి నుంచి విముక్తి కలిగి నిరంతర సాగునీటి సౌకర్యం లభించాలని పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందడంతో పాటు సమాజంలో రైతుకు గౌరవప్రదమైన జీవితం లభించినప్పుడే దేశంలో వ్యవసాయ రంగం పూర్తిస్థాయిలో బలోపేతమవుతుందని తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ఎంతో ఘనంగా జరగనున్న 36వ ఏఐకేఎస్ జాతీయ మహాసభలు దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న అనేక తీవ్రమైన సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించేందుకు ఒక వేదికగా నిలవనున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు రవి నాయక్, సామాజికవేత్త డాక్టర్ రాజు, యోగా గురువు సిద్ధయ్య పాల్గొన్నారు.

## వైభవంగా అక్షరాభ్యాసాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ సరస్వతీ అమ్మవారి దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆలయాలలో విద్యాదాయిని సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలను అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారికి, స్వామివారికి శ్రద్ధతో మొక్కారు. చిన్నారులకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అక్షరాభ్యాసాలు జరిపించారు.శృంగేరి శారదాపీఠాధిపతులు జగద్గురు ఆదిశంకరాచార్య పరంపరలో 36వ పీఠాధిపతులైన భారతీ తీర్థ మహాస్వామివారి దివ్య ఆదేశాల మేరకు రెండు దేవాలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక జపాలు, అర్చనాదులు ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ట్రస్ట్ ధర్మాధికారి డాక్టర్ టి. ఫణీంద్ర చంద్రబాబు దంపతులతో పాటు పలువురు ప్రతినిధులు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా వచ్చి ఆదిశంకరాచార్యులకు, శారదా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నెరవేర్చారు. చిల్లంచర్ల శ్రీనివాస్, సత్యనారాయణ, రామచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

## చండీహోమంలో యెల్లంల సంజీవరెడ్డి

**ప్రజాపక్షం/మోటకొండూరు;** మోటకొండూరు మండల కేంద్రంలో శుక్రవారం హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రులను పురస్కరించుకొని దుర్గామాత ఆలయంలో జరుగుతున్న చండీహోమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు యెల్లంల సంజీవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని గిరిబోయిన గూడెంలో సర్పంచ్ రంగు సిందూజ గ్రామ ప్రజలు నూతన వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేయమని కోరగానే స్పందించి నూతన వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయిస్తామని సంజీవరెడ్డి హామీ ఇచ్చి ఫిల్టర్ స్థలాన్ని పరిశీలించి తక్షణమే నూతన వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసి దసరా వరకు ప్రజలకు మంచినీటిని అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హనుమాన్ యూత్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, మదార్‌గౌడ్, వంగపల్లి పిఏసిఎస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం, ముత్తిరెడ్డిగూడెం సర్పంచ్ బాలరాజు గౌడ్, మహేందర్, అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకులు చందు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





## బాధితులకు ఫోన్లను తిరిగి అందించడంలో పోలీసు శాఖ విశేష కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజలు వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేయడంలో సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ విశేష కృషి చేస్తుందని జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. ఇందులో భాగంగా సిఇఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన రూ.20లక్షలకు పైగా విలువైన 105 మొబైల్ ఫోన్లను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100కు పైగా మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేయడం ఇది 15వ సారి అని తెలిపారు. మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైందన్నారు. సుదూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిన మొబైళ్ళను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించడంలో సైబర్ వారియర్స్ కృషి మరువలేనిదన్నారు. ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యాశకు పోయి ఆన్‌లైన్ మోసాల బారిన పడవద్దని కోరారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## పగిలిన బీరు సీసాతో వ్యక్తిపై దాడి



**ప్రజాపక్షం/చందంపేట;** నల్లగొండ జిల్లా చందంపేట మండల పరిధిలోని కాట్రావత్ తండా గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కాట్రావత్ హన్మంతు పై కాట్రావత్ శ్రీకాంత్ పగిలిన బీరు సీసాతో దాడి చేయడం హన్మంతుకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను గోనే సంతులు తీసుకురావడానికి ఇవ్వకపోవడంతో క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన వాట్సాప్ సందేశాల విషయంలో ఏర్పడిన అభిప్రాయ భేదాల కారణంగా ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో మూడావత్ తిరుపతి ఇంటి ముందు జరిగిన గోడవలో శ్రీకాంత్ పగిలిన బీరు సీసాతో హన్మంతుపై దాడి చేయడంతో ఎడమ పొత్తికడుపు, ఎడమ భుజానికి గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు హన్మంతు భార్య శీల ఫిర్యాదు మేరకు చందంపేట ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భక్తిభావాన్ని పెంపొందించేవే ఆధ్యాత్మిక కార్యక్రమాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తాయని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 25వ వార్డు చిన్న వినాయకుడి గుడి, చంద్రన్నకుంటలో సన్‌సిటి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేసి మాట్లాడారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.





## పలు సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/మునుగోడు :** మండల కేంద్రంలో దోమల నివారణ,పందుల బెడద,రహదారుల శుభ్రత, ప్రతి గురువారం నిర్వహించే కూరగాయల మార్కెట్‌ను రహదారిపై కాకుండా ప్రత్యామ్నాయ ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి,గ్రామ సర్పంచ్,కార్యదర్శులకు ఈ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్టూడెంట్ నాయకులు మాట్లాడుతూ ఇవి ప్రజారోగ్యం,గ్రామ పారిశుద్ధం,ప్రజల రాకపోకలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు.వినతి పత్రం అందజేసిన వారిలో తీగల శశి,పులకరం శివ,మునుగోటి శివ పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఒక చోట చేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఆనందోత్సహాల నడుమ సద్దుల బతుకమ్మను నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా గుండాల సర్పంచ్ అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయినటువంటి బతుకమ్మ వేడుకలను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వైభవంగా నిర్వహించామని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టి మౌలిక సదుపాయాలను కల్పించినట్లు ఆయన తెలిపారు.

## నవరాత్రులు అంటేనే శక్తి స్వరూపిణిని పూజించే గొప్ప పండుగ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నవరాత్రులు అంటేనే శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని పూజించే గొప్ప హిందూ పండుగని మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కనకదుర్గమ్మ దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొల్లి సంధ్యారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తొమ్మిది రోజుల పాటు నిష్టగా అమ్మవారిని పూజించి అమ్మవారి కృప కరుణకు పాత్రులు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి నాగకృష్ణప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.



# రూ.300కోట్ల బడ్జెట్ విడుదల చేయాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** కుమ్మరులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి రూ.300 కోట్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మరి వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్పోరేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా మాట్లాడారు. తుంగతుర్తి నియోజక వర్గం ఇంచార్జి కోటమర్తి శ్రీనివాస్, జిల్లా కోకన్వీనర్ మద్దికుంట్ల యల్లయ్యలు మండల కమిటిని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా కోటమర్తి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి ఏకస్వామి, కోశాధికారిగా నిమ్మనగోటి శ్రీరాములు, గౌరవ అధ్యక్షులుగా మారపాక రాములు, కోటమర్తి మల్లయ్య, ఉపాధ్యక్షులుగా చిగుర్ల వెంకన్న, కోటమర్తి వెంకన్న, సహాయ కార్యదర్శులుగా గంగాధరి మధుసూదన్, మండల యూత్ విభాగం అధ్యక్షులుగా కోటమర్తి నవీన్, ప్రధాన కార్యదర్శి కోటమర్తి ఏకస్వామి, ఉపాధ్యక్షలుగా మారపాక సంతోష్, సహాయ కార్యదర్శిగా కందుకూరి గణేష్, ప్రచార కార్యదర్శిగా నిమ్మనగోటి కిరణ్, వృత్తిదారుల మండల అధ్యక్షులు కోటమర్తి రాములును ఎన్నుకున్నారు. గ్రామ కమిటిల సమక్షంలో మండల కమిటిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం కన్వీనర్ కాసుల లింగయ్య, పట్టణ అధ్యక్షులు సలిగంటి నాగయ్య, ప్రచార కార్యదర్శి వావిలాల ప్రభాకర్, తుంగతుర్తి నియోజక వర్గంలోని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# జనగణన 2027 రెండో దశపై చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జనగణన 2027 రెండో దశలో భాగంగా జనాభా గణనను సమర్ధవంతంగా నిర్వహించేందుకు సూర్యాపేట జిల్లాలో చార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రతిగణన గృహంలోని ప్రతి వ్యక్తిని తప్పనిసరిగా నమోదు చేయడం, ఖచ్చితమైన జనాభా వివరాల సేకరణ, ఎన్యూమరేషన్ బ్లాకుల, సబ్ ఎన్యూమరేషన్ బ్లాకుల ఏర్పాటు వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించారు. మొదటి దశలో ఏర్పాటు చేసిన హౌస్‌లిస్టింగ్ బ్లాకులను రెండో దశ జనాభా గణనకు అనుగుణంగా ఇబిలుగా మార్చడం, జనాభా, పనిభారం ఆధారంగా అవసరమైన చోట సబ్‌ఇబిలను ఏర్పాటు చేయడం, ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు తగిన విధంగా విధులు కేటాయించడం గురించి వివరించారు.



ప్రతి ప్రాంతం పూర్తిస్థాయిలో గణన పరిధిలోకి వచ్చేలా బ్లాకుల సరిహద్దులను పరిశీలించి, ఎలాంటి ప్రాంతం లేదా వ్యక్తి గణనలో మిగిలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా జనగణన ఇంచార్జి ఎస్లావత్ హోబాలాల్ పర్యవేక్షించగా, శిక్షకులు జంగయ్య శిక్షణ అందించారు.

# రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వాలి



**ప్రజాపక్షం/నకిరేకల్:** వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటలపాటు నిరంతరాయంగా సరఫరా చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు.శుక్రవారం మండలంలోని మర్రూరు గ్రామంలో విద్యుత్,సాగునీటి సమస్యలతో ఎండిపోతున్న పంట పొలాలను ఆయన పరిశీలించారు.అనంతరం రైతులతో కలిసి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు 24 గంటల విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగైదు గంటలే సరఫరా చేస్తోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు.విద్యుత్ కోతలతో పంటలకు సకాలంలో నీరందక ఎండిపోతున్నాయని,అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మాధ ధనలక్ష్మి నగేష్ గౌడ్,మండలపార్టీ అధ్యక్షుడు నవీన్ రావు,మండల యూత్ అధ్యక్షులు పేర్ల కృష్ణకాంత్,మాజీ పిఎసిఎస్ చైర్మన్ మహేందర్ రెడ్డి,నాయకులు సదానందం,దైద పరమేశమ్,పల్లె విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** అర్హులైన పట్టభద్రులు ఎంఎల్‌సి ఓటు నమోదు చేసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవికుమార్ పట్టభద్రులకు సూచించారు. శుక్రవారం దేవరకొండలో ఎంఎల్‌సి ఓటరు నమోదు సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన బీజెపి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎంఎల్‌సి ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఉద్యోగులకు పిఆర్సీ అమలు చేయకుండా, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు పీఆర్సీ అమలు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించినప్పటికి ఉద్యోగ నియామకాల విషయంలో ఆశించిన పురోగతి లేదని, ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందని రవికుమార్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అసెంబ్లీ ఎంఎల్‌సి ఇంచార్జీ నక్క వెంకటేష్ యాదవ్, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహా, భాస్కర్, పట్టణ అధ్యక్షులు సుధాకర్, రాము, ఉదయ్, చండీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**ప్రజాపక్షం/మోటకొండూరు;** వర్షాలు సంవృద్ధిగా కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య కోరుకున్నారు. శుక్రవారం మోటకొండూరు మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో నెలకొల్పిన దుర్గామాత చండీ హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలుపుతూ బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు ఆనందోత్సవాల నడుమ సుఖ సంతోషాలతో ఇంటిల్లిపాది జరుపుకోవాలని అన్నారు. దుర్గా మాత ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండి సంవృద్ధిగా వర్షాలు కురిపించాలని ఆ అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రాయికుంటపల్లిలో నూతన గృహ ప్రవేశం చేసిన కుటుంబాలకు పట్టు వస్త్రాలు అందజేసి రూ. 10వేలు ఆర్ధిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుల సంజీవరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రఘునాథరాజు, సర్పంచ్ జయమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దేవాలయంలో కమిషనర్ పూజలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం సూర్యాపేట మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. విజయదశమి సందర్భంగా మున్సిపాలిటి ఆధ్వర్యంలో శమీపూజకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేయగా, కమిటి సభ్యులు సన్మానించారు. కమీషనర్ వెంట జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, దేవాలయ కమిటి సభ్యులు బ్రాహ్మణపల్లి మురళీధర్, పబ్బా ప్రకాశరావు, గోపారపు రాజు, అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ, బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

## బిజెవైఎం చండూరు మండల అధ్యక్షుడిగా పల్లపు స్వామి

**ప్రజాపక్షం/చండూరు:** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) చండూరు మండల అధ్యక్షుడుగా మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన పల్లపు స్వామి ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా పల్లపు స్వామి మాట్లాడుతూ బీజేవైఎం చండూరు మండల అధ్యక్షుడుగా తనకు బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందని పల్లపు స్వామి పేర్కొన్నారు. మండలంలో భారతీయ జనతా పార్టీ తో పాటు యువమోర్చాను బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. యువతను పార్టీ వైపు ఆకర్షించి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందకు కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన బిజెపి రాష్ట్ర నాయకుడు గంగిడి మనోహర్‌రెడ్డి , బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కె.సతీష్ కుమార్ యాదవ్ , జిల్లా కార్యదర్శి వరికుప్పల గిరి , జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదగోని వెంకన్న, బిజెపి చండూరు మండల అధ్యక్షుడు ముదిగొండ ఆంజనేయులుకు పల్లపు స్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## భాషా మృతి బాధాకరం

**ప్రజాపక్షం/చందంపేట;** చందంపేట మండల పరిధిలోని బండమీదితండాకు చెందిన సభావత్ బాషా గుండెపోటుతో మృతి చెందడం బాధాకరం అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యానాయక్ అన్నారు. శుక్రవారం బాషా పార్ధివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి రూ. 5వేలను ఆర్ధిక సాయంగా అందజేశారు. రమేష్‌నాయక్, హరి, రమేష్, భాను, కుమార్, రవీందర్, బద్రు, లచ్చిరాం, దినేష్, రమేష్ పాల్గొన్నారు.



## ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలి

ప్రజాపక్షం/సూర్యాపేట : అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం పట్టణంలోని 19వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు దారోజు భాగ్యరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తాయన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ



ప్రజాపక్షం/చందంపేట; చందంపేట మండలం గాగిళ్ళాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్, మాజీ ఎంపిటిసి తంగెళ్ల రామకృష్ణారెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో శుక్రవారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ఆసుపత్రికి వెళ్ళి రామకృష్ణారెడ్డిని పరామర్శించారు. వైద్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆయన వెంట చందంపేట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ప్రమాదం జరిగిన గురువారం సాయంత్రం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించే ఏర్పాట్లలో ఎంఎల్‌ఏ చొరవ చూపారు.

## బిజెపి ఆధ్వర్యంలో ఓటరు నమోదు

ప్రజాపక్షం/డిండి; డిండి మండల బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం డిండి పట్టణంలో ఎంఎల్‌సి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటరు నమోదు పై అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరు తమ పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా బిజెపి ఎంఎల్‌సి ఎన్‌రోల్‌మెంట్ దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ నక్క వెంకటేష్‌యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు లాలునాయక్‌లు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఎంఎల్‌సి ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి, భాస్కర్, అసెంబ్లీ కన్వీనర్ ఎటి కృష్ణ, సాయి, సినియన్ నాయకులు శేఖర్, పుష్పలత, ప్రవీణ్, నర్సింహారావు, మండల అధ్యక్షులు సైదా, దేవరకొండ పట్టణ అధ్యక్షులు సుధాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



## ఉచిత చెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ క్యాంపు ప్రారంభం



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్‌జోష్ కార్యక్రమం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఔరవాణి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత మొబైల్ చెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ శిబిరాన్ని ఎంపిడీఓ కె.ఉమేష్ ప్రారంభించారు.ఆధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతతో కూడిన మొబైల్ ఎక్స్‌రే వాహనం ద్వారా గ్రామ ప్రజలకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.వ్యాధి లక్షణాలు ఉన్నవారిని తదుపరి పరీక్షలు, వైద్య సేవల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించారు.ఈ శిబిరంలో మొత్తం 55 మందికి ఛాతీ ఎక్స్‌రేతో పాటు రక్తంలో చక్కెర స్థాయి,రక్తపోటు పరీక్షలు నిర్వహించారు.నల్లగొండ జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కాలి పరమేష్,ఉప సర్పంచ్ శివరాత్రి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న దేవి,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అశ్వక్,సూపర్‌వైజర్లు శ్రీనివాస్, అజయ్,సైదులు,అంజన్,చారి,ఏఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు,టీబీ అలర్ట్ ఇండియా ప్రతినిధులు, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శుక్రవారం రోజున ఈ నెల పదిహేను, పదహారు తేదీల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో నూతన ఓటర్లు ఆఫ్‌లైన్‌లోనూ తమ పేర్లను పెద్దఎత్తున నమోదు చేసుకున్నారు. మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని సుమారు 286 పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఈ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు.మిర్యాలగూడ నియోజకవర్గంలో ఆన్‌లైన్ ద్వారా సుమారు రెండు వేల మంది, బిఎల్ఓల వద్ద ఆఫ్‌లైన్ ద్వారా సుమారు 1500 మంది వరకు కొత్తగా ఓట్లు నమోదు చేసుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి స్థాయి అధికారిక సమాచారం త్వరలోనే వెలువడనుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ పోలింగ్ కేంద్రాల బిఎల్ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, యువ ఓటర్లు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి వెళ్లి గ్రాడ్యుయేట్ల ఓటు నమోదు చేయించాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ప్రతి డివిజన్‌లోని ముఖ్య నాయకులు,ఓటర్ ఎన్‌రోలర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి సూచించారు.శుక్రవారం నల్లగొండలోని కంచర్ల క్యాంపు కార్యాలయంలో నగరంలోని 26 నుంచి 48 డివిజన్ల వరకు ముఖ్య నాయకులు, డివిజన్ ఇన్‌చార్జులు,గ్రాడ్యుయేట్ ఓటర్ ఎన్‌రోలర్లతో అత్యవసర సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లోని నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వారి ఇంట్లోని గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించాలని, ఇప్పటికే ఓటర్ నమోదు చేసుకున్న వారి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు.ప్రజల ముందు ఇప్పుడు రెండు మార్గాలు ఉన్నాయని, ఒకటి వర్షిప్, రెండు ఎక్స్‌పెరిమెంట్ అని, తెలంగాణ ప్రజలు ఇప్పుడు ఎక్స్‌పెరిమెంట్ చేసే అవకాశం లేదన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్,అభిమన్యు శ్రీనివాస్,మిర్యాల యాదగిరి,రావుల శ్రీనివాస్ రెడ్డి,జమాల్ ఖాద్రీ,పెరిక కరణ్ జయరాజ్, కన్నారావు,జయప్రద రెడ్డి,అయితగోని జనార్ధన్,కత్తుల నాగరాజు,అశ్వాక్,గడలే జయప్రకాష్,గంజి రాజేందర్,మిరియాల స్వామి,ఓవైజ్ షా, పొగాకు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉన్నందున ఉమ్మడి నల్లగొండ జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని టి.సిపిఐ రాష్ట్ర అధ్యక్షురాలు కోతి ఇందిరా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో డిసెంబర్ చివరి నాటికి పరిస్థితులు మరింత దిగజారవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. జిల్లాలో సాధారణం కంటే 34 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.రానున్న నాలుగైదు నెలల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని,భూగర్భ జలాలు అడుగంటకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిస్తున్నప్పటికీ,క్షేత్రస్థాయిలో రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన భరోసా లభించడం లేదని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు, వ్యవసాయం, విద్యుత్,పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



## పాండవుల జీవితం నేటి తరానికి ఆదర్శం

ప్రజాపక్షం/గరిడేపల్లి: పాండవుల జీవితం, వారు ఎదుర్కొన్న కష్టాలు, వాటిని అధిగమించిన తీరు నేటి తరానికి ఆదర్శప్రాయమని గరిడేపల్లి సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ముదిరాజ్‌ల కులదైవమైన పాండవుల ఆలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాభారతంలో పాండవులు అనుసరించిన జీవన విధానం, ధర్మం పట్ల వారు చూపిన నిబద్ధత, జీవితంలో ఎదురైన కష్టసుఖాలను అధిగమించిన తీరు ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు త్రిపురం అంజన్‌రెడ్డి, పైడిమర్రి రంగనాథ్, పెండెం శ్రీనివాసగౌడ్, బండ నర్సిరెడ్డి, కర్నె అరుణలక్ష్మి నారాయణ, ముదిరాజ్ కులస్తులు చామకూరి నాగేశ్వరరావు, చామకూరి దశరథ, సైదులు పాల్గొన్నారు.

## కోర్టు విచారణకు డుమ్మా.... నిందితుడికి జైలు శిక్ష

ప్రజాపక్షం/మేళ్లచెరువు: కోర్టు విచారణకు హాజరుకాకుండా తప్పించుక తిరుగుతున్న నిందితుడికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేళ్లచెరువు గ్రామానికి చెందిన పిల్లుట్ల బ్రహ్మంపై 2015లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు విచారణకు అతను సకాలంలో హాజరుకాకపోవడంతో కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి అతనికి జైలు శిక్ష విధించారు. కాగా పాత కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న నిందితులందరూ కోర్టు ఉత్తర్వుల ప్రకారం సకాలంలో న్యాయస్థానం ముందు హాజరుకావాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని మేళ్లచెరువు ఎస్ఐ హెచ్చరించారు.

## పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్



ప్రజాపక్షం/అనంతగిరి: మండల పరిధిలోని తమ్మరబండపాలెంలో శుక్రవారం తెల్లవారుజామున కోదాడ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, కోదాడ రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో సబ్ డివిజనల్ పరిధిలోని ఎస్ఐ లు, సుమారు 60 మంది పోలీస్ సిబ్బంది ఈ తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేసి అనుమానాస్పద పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సుమారు 53 ద్విచక్ర వాహనాలు, ఆటోలను తనిఖీ చేసి వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ఇతర ధృవపత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : మండలంలోని బాలెంల స్టేజీ సమీపంలో సూర్యాపేట జనగాం రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వాకర్స్ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చరి వద్దకు వెళ్ళి వారి మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్వగ్రామానికి చెందిన గుర్రం సైదులు, ఆలకుంట్ల నాగరాజు మృతి చెందడం, గొల్ల జానయ్యకు బలమైన గాయాలు కావడం విషాదకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన ఆయన గాయాలైన జానయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత ఇష్టంతో జరుపుకుంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ అన్నారు. శుక్రవారం రోజున పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీషనవీన్, కమిషనర్ నర శ్రీజారెడ్డి బతుకమ్మ పాటలకు తగినట్లుగా ఉత్సాహంగా ఆడిపాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా ఉత్సవాలలో పాల్గొనడం హర్షణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కల్యాణి, ఇందిర, రూస్నీ, శ్వేత, పావని, లక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యందు బతుకమ్మ సంబరాలు వైద్య సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. ప్రాథమిక వైద్యాధికారి నగేష్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణలో సంస్కృతి, సంప్రదాయబద్ధంగా ఆడపడుచులు జరుపుకునే పండుగని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మాలోతు బిచ్చు నాయక్, హెల్త్ సూపర్ వైజర్ లలిత, ఎంఎల్హెచ్పి లు గౌతమి, లావణ్య, వాస్రిత, వీరయ్య, సైదమ్మ, అనూష, ఊర్మిళ, గిరిజ, శ్వేత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ,సంస్కృతి సాంప్రదాయానికి ప్రతిక అని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం మహిళ కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని క్లాక్ టవర్ సమీపంలో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయం ఇందిరా భవన్ లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎగ్గడి సుజాత,పట్టణ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య నరసింహ,సూరెడ్డి సరస్వతి,స్వాతి కరుణాకర్ రెడ్డి,సదా లక్ష్మి,స్వరూప, రుద్ర, పద్మ, నారాయణమ్మ,వెంకటమ్మ,సరోజ,నిర్మల, పెరిక లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.





## చదువుల తల్లిగా దర్శనం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని లింగాల గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం అమ్మవారు చదువులు తల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఇరుగంటి రమణ శాస్త్రి, సత్యనారాయణ శాస్త్రిలు పసుపుకుంకుమలతో, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళహారతులు ఇచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామ సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డితోపాటు గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## కంటి సమస్యతో బాధపడొద్దు



**ప్రజాపక్షం/చండూరు:** కంటి సమస్యతో ఏ ఒక్కరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో అవసరం ఉన్న వారికి కంటి పరీక్షలను నిర్వహించడం జరిగింది. అందులో కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి అద్దాలను పంపిణీ చేయడం అభినందనీయమని సర్పంచ్ ముక్కాంల వెంకన్న యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు గండు వెంకట్‌గౌడ్ , మందడి శంకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సీత యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/భుదాన్ పోచంపల్లి:** రైలు ప్రమాదంలో గొర్రెలు కోల్పోయిన బాలముని కిష్టయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టవీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు.ఇటీవలే ఘట్కేసర్ మధ్య కొండమడుగు వద్ద జరిగిన విషాద ఘటనలో దాదాపు 500 గొర్రెలు మృత్యువాత పడి బాధితుడికి తీవ్ర నష్టాన్ని మిగిల్చిన నేపథ్యంలో శుక్రవారం ఆయన పరామర్శించారు.సంఘం తరపున 32 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.నష్ట పరిహారం కోసం న్యాయం చేయాలని ఎమ్మెల్యే సహకారంతో సిఎం దృష్టికి తీసుకెళుతాననీ భరోసా ఇచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు దేశపంగు మధు తండ్రి గురువయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎర్రపహాడ్ గ్రామ మాజీ ఎంపిటిసి సభ్యులు గాడుదుల అవిలయ్య అనారోగ్యానికి గురికావడంతో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ శుక్రవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మున్న మల్లయ్య యాదవ్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిల్ గౌడ్, సర్పంచులు మాదాసు వెంకన్న, గాడుదుల లింగరాజు యాదవ్ పాల్గొన్నారు.





## ఓటు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** పట్టభద్రులు తప్పకుండా నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రులు ఉచిత ఓటర్ నమోదు ద్వారా నమోదు చేసుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ఎంఎల్‌సి ఉచిత ఓటర్ నమోదు సహాయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపల్లి మధుకర్ రెడ్డి, నాయకులు వెల్పుల రమేష్, జీడి వీరస్వామి, జెరిపోతుల లక్ష్మ ణ్, శిగ నసీర్ గౌడ్, అర్వపల్లి సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్, సూర్యనాయక్ తండ సర్పంచ్ క్రిష్టా నాయక్ పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ వర్కర్స్ సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/చండూరు:** గ్రామ పంచాయితీ పరిశుభ్రతలో మల్టీపర్పస్ వర్కర్స్ చేస్తున్న సేవలు మరువలేనివని కస్తాల సర్పంచ్ లేదన్న సత్యం అన్నారు. శుక్రవారం కస్తాల గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ లేదన్న సత్యం అధ్యక్షతన పాలక వర్గం సభ్యులు గ్రామ పంచాయితీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లను ఘనంగా సన్మానించి వారికి సేఫ్టి కిట్స్ కింద సబ్బులు , నూనె , బూట్లు , గ్లౌజ్‌లు తో పాటు డ్రేస్ కోడ్ దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కట్ట స్వర్ణ నర్సింహ్మా, పంచాయితీ కార్యదర్శి ఎన్. రాజేష్ గౌడ్ , జిపిఓ యాదయ్య , వార్డు మెంబర్లు బొమ్మరబోయిన కవిత , మెరుగు అంజయ్య , సిబ్బంది పుష్పలత , ప్రభాకర్ రెడ్డి , లింగస్వామి , సైదులు , ఆరుద్ర ,అంజయ్య పాల్గొన్నారు.



## జలసిరి పనులపై జన చైతన్య గీతం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని నెల్లిబండ గ్రామంలో శుక్రవారం జలసిరి బతుకమ్మ పాట చిత్రీకరణ ప్రారంభించారు. ఎంపిడిఒ జీ. బ్రహ్మచారి స్వయంగా రచించి,దర్శకత్వం వహిస్తున్న జలసిరి బతుకమ్మ పాట చిత్రీకరణను అడిషనల్ కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కెమెరా స్విచ్ ఆన్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఎల్ నినో నీడలను తరిమికొట్టేలా,జలసిరి పనుల ప్రాధాన్యతను వివరిస్తూ ఈ బతుకమ్మ పాటను రూపొందించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో జీ. బ్రహ్మచారి,ఎంపిఓ రజిత,ఎపిఓ రమణయ్య, సర్పం చులు ఆడెపు రాఘవులు, మాచర్ల చంద్రకళ,చిర్రబోయిన లక్ష్మి,ఉప సర్పంచ్ యానాల సరిత,ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని,అంగన్వాడి టీచర్లు పోడి శెట్టి నాగమణి, సుభాషిని,వివిధ గ్రామాల కార్యదర్శులు స్వాతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియుటిఎస్‌రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

**రాష్ట్ర అధ్యక్షుడిగా సుంకరి భిక్షంగౌడ్,ప్రధాన కార్యదర్శిగా బి.మధుసూదన్‌రెడ్డి**

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా భిక్షంగౌడ్ ప్రకటన..పెన్షనర్ల సంఘం సంపూర్ణ మద్దతు**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ స్టేట్ (పీఆర్టీయూటీఎస్) నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా సుంకరి భిక్షంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బి.మధుసూదన్ రెడ్డి ఎన్నికయ్యారు.నల్లగొండలో నిర్వహిస్తున్న పీఆర్టీయూ ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజు రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు.రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు ఐదు వేల మంది ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. అధ్యక్షుడిగా సుంకరి భిక్షంగౌడ్,ప్రధాన కార్యదర్శిగా బి.మధుసూదన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించగా, ఎన్నికల అధికారులు పేరి వెంకట్‌రెడ్డి,గుండు లక్ష్మణ్, మనోహర్‌రావు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా నూతన రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్ మాట్లాడుతూ ఉద్యోగులు,ఉపాధ్యాయులు,నిరుద్యోగులు,పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు.సుమారు మూడు దశాబ్దాలుగా ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల్లో పాల్గొన్న అనుభవంతో ప్రజల ముందుకు వస్తున్నానని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల సాధనతో పాటు పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

భిక్షంగౌడ్‌కు పెన్షనర్ల సంఘం సంపూర్ణ మద్దతు

రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య కార్డుల వ్యవస్థలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు పీఆర్సీ సాధన కోసం ఉద్యోగులు,ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుంకరి భిక్షంగౌడ్‌కు రాష్ట్ర పెన్షనర్ల సంఘం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

